పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక

నూతన కమిటీ సభ్యులు

గోపాల్‌పేట, అక్టోబర్ 13: పీఆర్‌టీయూ రేవల్లి మండల నూతన కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో పీఆర్‌టీయూ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి, సహ అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్, కార్యదర్శిగా బాలస్వామిని, జిల్లా ఉపాధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎన్నిక పరిశీలకుడిగా శ్రీరంగాపురం మండ ల అధ్యక్షుడు శ్రీనివాసులు వ్యవహరించారు.

వనపర్తి అర్బన్ కమిటీ ఎన్నిక

వనపర్తి టౌన్, అక్టోబర్ 13: పీఆర్టీయూ తెలంగాణ వనపర్తి అర్బన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సూర్యశేఖర్‌రెడ్డి, ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, సహాయ అధ్యక్షుడిగా గోపాలకృష్ణయాదవ్, మహిళ ఉపాధ్యక్షులుగా అనిత, వనజశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కార్యదర్శిగా మద్దిలేటితో పాటు సరస్వతి, రాజేశ్వరి తదితరులను ఎన్నుకున్నారు.

పురపాలికలో యాంటీ లార్వా సర్వే

నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

పెబ్బేరు, అక్టోబర్ 13: పెబ్బేరు పురపాలిక పరిధిలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది యాంటీ లార్వా సర్వే నిర్వహించారు. ప్రస్తుతం డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సంభవిస్తున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిమెంట్ ట్యాంకులు, పూలకుండీలు, ఎయిర్ కూలర్లు, వాటర్ డబ్బాలలో నీరు నిల్వ ఉండకుండా తరచూ వాటిని శుభ్రపరుస్తుండాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, సిబ్బంది రాజశేఖర్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై జగదీశ్వర్

పెబ్బేరు, అక్టోబర్ 13: అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న కేంద్రాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. గురువారం చెలిమిల్లలో రూ.55వేల విలువ గల మద్యం పట్టుకోగా, తాజాగా శుక్రవారం గుమ్మడంలో ఆంజనేయులు కూల్‌డ్రింక్ షాపులో నిల్వ ఉంచిన 20లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.లక్ష స్వాధీనం..

అలాగే స్థానిక కొల్లాపూర్ క్రాస్‌రోడ్డులోని పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించగా, ఒక కారులో తరలిస్తున్న రూ. లక్ష పట్టుకున్నట్లు తెలిపారు. శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన వంగూరు సాయిరాంరెడ్డి వీటిని తరలిస్తుండగా తగిన రసీదులు చూపకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

వైరల్ 'ఫీవర్'

- జ్వరాలతో జనం విలవిల
- దవాఖానల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య

పెబ్బేరు దవాఖానలో డాక్టర్‌ను సంప్రదించడానికి క్యూలో ఉన్న రోగులు

పెబ్బేరు, అక్టోబర్ 13 : ప్రస్తుతం జ్వరాలు విజృంభిస్తుండటంతో జనం తల్లడిల్లుతున్నారు. వాతావరణంలో జరుగుతున్న మార్పుల కారణంగా జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గత నెలరోజుల నుంచి రోగులతో దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా టైఫాయిడ్, మలేరియా వ్యాధులు విజృంభిస్తున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. ప్రైవేట్‌తోపాటు ప్రభుత్వ దవాఖానల్లో రోగులు ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నారు. 24గంటలు సేవ లందించే పెబ్బేరు పీహెచ్‌సీలోనూ రోజుకు 150మంది అవుట్ పేషెంట్లుగా చికిత్సలు పొందుతుంటే ఇందులో జ్వరాల బారిన పడ్డ వారి సంఖ్యే ఎక్కువగా ఉంటోంది. జ్వరం తీవ్రత అధికంగా ఉండే రోగులకు వైద్యులు సెలైన్ బాటిళ్లు పెట్టి చికిత్సలందిస్తున్నారు. ఇక ప్రైవేట్ దవాఖానల్లోనూ రోగుల సంఖ్య గణనీయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు జ్వరాల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పెబ్బేరులో నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

పెబ్బేరులోని చిన్న చౌడేశ్వరీదేవి ఆలయం

పెబ్బేరు, అక్టోబర్ 13 : పెబ్బేరు పట్టణంలో ఈనెల 15నుంచి జరిగే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చిన్న చౌడేశ్వరీ దేవీ ఆలయంలో యేటా పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పర్యాయం కూడా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు సాయి గణేశ్ యూత్ సభ్యులు తెలిపారు. మొదటి రోజున గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, రక్షధారణం, అఖండ దీపస్థాపన, షోడశోపచార పూజ, పంచా మృతాభిషేకం, మహామంగళ హారతి, మంత్ర పుష్పం, పంచోపదార పూజ, కుంకుమార్చన, తీర్థప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు.

అవతారాలు ఇలా..

15వ తేదీ మొదటి రోజున అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవీగా, 16న గాయత్రీదేవీగా, 17న అన్నపూర్ణాదేవీగా, 18న మహాలక్ష్మీదేవీగా, 19న మహాంకాళీ దేవీగా భక్తులకు దర్శనమిస్తారు. అదే రోజు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తారు. 20న సరస్వతిదేవీగా దర్శనమిస్తుండగా, చిన్నపిల్లలకు అక్షరాభ్యాసంతోపాటు పుస్తకాలను పంపిణీ చేస్తారు. 21న శాకాంబరీదేవీగా, మహాలక్ష్మీగా దర్శన మిస్తుండగా పల్లకీ సేవ నిర్వహిస్తారు. 22న మహిషాసురమర్ధని, రాజారాజేశ్వరీ దేవీగా 23న విజయదశమి సందర్భంగా దుర్గాదేవిగా అలంకరణలతో భక్తులకు దర్శనమిస్తారు.

మొదటి రోజున భజన కార్యక్రమంతో ఆంజనేయస్వామి ఆలయం నుంచి చిన్న చౌడేశ్వరీ ఆలయం వరకు విగ్రహం ఊరేగింపు, ప్రతిష్ఠ నిర్వహిస్తారు. 23న తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు వెల్లివిరిసే విధంగా బతుకమ్మ బోనాలు, బొడ్డెమ్మలులతో అమ్మవారి నిమజ్జనం చేస్తారు. అలాగే ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగాబ తుకమ్మవే డుకలు

బతుకమ్మలతో గాయత్రి వృత్తివిద్య, ఎస్వీఎమ్మార్ కాలేజీ విద్యార్థినులు

వనపర్తి టౌన్, అక్టోబర్ 13: దసరా పండుగను పురస్కరించుకొని వనపర్తి జిల్లా కేంద్రంలో పలు కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల, పురుషుల డిగ్రీ కళాశాల, ఎస్వీఎమ్మార్ కళాశాల, గాయ్రి వృత్తి విద్య కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ముందుగా విద్యార్థినులు తంగెడు, గులాబీ, మందారం, చామంతి, గునుగు, బంతి తదితర పూలను పేర్చి బతుకమ్మను , గౌరమ్మలను తయారు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ ప్రకృతి, మాన సంబంధాలతో కూడిన బతుకమ్మ పండుగ అని, వేములవాడలోని రాజరాజేశ్వరీ ఆలయంలో శివలింగాన్ని చాళుక్య రాజులు సత్కరించి, చెన్నైలో శివుని ఆలయాల్లో ప్రతిష్ఠించడం జరిగిందని, శివుని, పార్వతిని వేరుచేసినప్పుడు మహిళలు పెరు పర్వతంలా రంగురంగుల పూలతో చేసి బతుకమ్మలు ఆడారని, నాటి నుంచి నేటి దాకా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. మహిళలు, విద్యార్థుల ఆటపాటలతో కళాశాలల ఆవరణమంతా హోరెత్తాయి. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు యాదగిరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, దాంసింగ్, సురేందర్‌రెడ్డి, గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, మల్లికార్జున్, శ్రీనివాసులు, ఎస్వీఎమ్మార్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ఇతర అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు రూపుమాపుదాం

వనపర్తి టౌన్, అక్టోబర్ 13: జిల్లాలో బాల్య వివాహాలను రూపుమాపుదామని షీటీం ఎస్సై ఇందిర, ఆర్డీఎస్ సొసైటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఉచిత శిక్షణ కంప్యూటర్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ, పుస్తకావిష్కరణ కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో పాటు సమాజంలో ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిని రూపుమాపేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలపై వివక్షను దూరం చేస్తే మెరుగైన సమాజం రూపుదిద్దుకుంటుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రవిశంకర్, ఆర్డీఎస్ సంస్థ అధ్యక్షురాలు చెన్నమ్మ థామస్, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్‌గౌడ్, డాక్టర్ మురళీధర్, సత్తార్, సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత, న్యాయవాదులు బి.కృష్ణయ్య, జయలక్ష్మీ, సౌజన్య, కమ్మర్ రెహమాన్, బైరోజు చంద్రశేఖర్ ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాధికారి నరహరి

ఖిల్లాఘణపురం, అక్టోబర్ 13: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వనపర్తి జిల్లా విద్యాధికారి నరహరి అన్నారు. శుక్రవారం మండలంలోని సోలీపూర్ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో 67వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ఆయా జిల్లాల నుంచి వచ్చి క్రీడాకారుల దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అదేవిధంగా జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు జ్ఞాపకశక్తిని పెంచుతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వనపర్తి జిల్లా క్రీడలకు పుట్టినిల్లని అదే ఒరవడిని వనపర్తి క్రీడాకారులు కొనసాగించాలని చెప్పారు. అండర్-17 విభాగంలో తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి 10 బాలుర జట్లు, 10 బాలికల జట్లు పాల్గొన్నాయని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఖోఖో క్రీడల కార్యదర్శి విలియం, నిర్వాహకులు నరసింహయాదవ్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.